

తరలిపోతున్న 'పోలవరం' మట్టి!
- ఎలమంచిలి సమీపంలో కాలువ గట్టును తవ్వుకుపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని ప్రాజెక్టు అధికారులు

- 8లో



ఎరువుల కృత్రిమ కొరత

అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులు
- రైతుల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారుల విచారణ
- జిల్లాలో తగినన్ని ఎరువుల నిల్వలు ఉన్నాయని వెల్లడి
- మరో 1,046 టన్నుల యూరియా రాక



మునగపాక పీఏసీఎస్‌లో ఎరువుల బస్తాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎరువుల కొరత నెలకొంది. అయితే ఇది ఎరువులు సరఫరా లేకపోవడం వల్ల కాదు. వ్యాపారులు, దళారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరత. దీనివల్ల సకాలంలో ఎరువులు లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరినాట్లు ఊపందుకున్నాయి. పొలాన్ని దమ్ము చేసిన తరువాత ఎరువులు వేసి, వరినాట్లు వేస్తుంటారు. ఇప్పటికే నాట్లు వేసిన పొలాలతోపాటు చెరకు, కూరగాయలు, ఇతర పంటలకు కూడా ఎరువుల అవసరం ఏర్పడింది. ముఖ్యంగా యూరియా, డీఏపీ వినియోగిస్తుంటారు. ఒక్కసారిగా ఎరువులకు గిరాకీ పెరిగింది. కాగా ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను ఇండెంట్ ప్రకారం జిల్లా అధికారులు ముందుగానే రప్పించారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం శుక్రవారంనాటికి జిల్లాలో మార్క్‌ఫెడ్ వద్ద 877 టన్నులు, వివిధ పీఏసీఎస్‌ల వద్ద 126 టన్నులు, ప్రైవేటు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఆరు టన్నులు, ప్రైవేటు రిటైలర్స్ వద్ద 962 టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 1,556 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎరువుల కోసం రైతులు పలు దుకాణాలు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. నర్సీపట్నం వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని నాతవరం, గొలుగొండ ... మిగతా 8వ పేజీలో

ఎరువుల దుకాణాల్లో నిరంతర తనిఖీలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, ఎరువుల సరఫరా వివరాలను రోజూ తన కార్యాలయానికి పంపించాలన్నారు.

ఎరువుల వ్యాపారిపై క్రిమినల్ కేసు

- తక్కువ ధర ఎరువులను, ఎక్కువ ధర ఉన్న బ్యాగుల్లోకి మార్చి అమ్మకం
- రైతుల ఫిర్యాదుతో విజిలెన్స్ దాడులు
- 20 బస్తాల ఎరువులు సీజ్

చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒక కంపెనీకి చెందిన తక్కువ ధర ఎరువులను, అదే కంపెనీకి చెందిన ఎక్కువ ధరల బ్యాగుల్లోకి మార్చి రైతులకు విక్రయిస్తున్న వ్యాపారిపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మీదేవి ఎరువుల దుకాణం యజమాని శ్రీనివాసరావు, పెదబజారు వీధిలోని ఓ ఇంట్లో ... మిగతా 8వ పేజీలో

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆడారి ఆనంద్‌కుమార్

అనకాపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):



ఆడారి ఆనంద్‌కుమార్

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ డెయిరీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన ఆడారి తులసీరావు రెండేళ్ల క్రితం మృతి చెందడంతో ఆయన కుమారుడైన ఆనంద్‌కుమార్ డెయిరీ పగ్గాలు చేపట్టారు. ఆది నుంచి టీడీపీలో వున్న ఆడారి కుటుంబం.. 2019 ఎన్నికల తరువాత రాజకీయ కారణాలతో వైసీపీలో చేరాల్సి వచ్చింది. అనంతరం ఆనంద్‌కుమార్ ఏపీఎంఎస్‌ఎండీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిచెందారు. గత ఏడాది డిసెంబరులో ఆయనతోపాటు విశాఖ డెయిరీకి చెందిన పలువురు డైరెక్టర్లు బీజేపీలో చేరారు. ఇప్పటి వరకు పార్టీలో సాధారణ కార్యకర్తగా ఉన్న ఆనంద్‌కుమార్‌ను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి వరించడంతో ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

- 'వర్షాకాలంలో పరిశుభ్రత' థీమ్
- వాడవాడలా కార్యక్రమాన్ని నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- 8లో

కుంగిన బొడ్డేరు వంతెన

ముందు జాగ్రత్త చర్యగా రాకపోకలు నిలిపివేసిన అధికారులు



బొడ్డేరు వాగుపై కుంగిపోయిన వంతెన



- పలు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు
- వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలే కారణమని స్థానికుల ఆరోపణ

చీడికాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దండిసురవరం శివారు బొడ్డేరు నదిపై కట్టువాని అగ్రహారం వద్ద వున్న వంతెన శుక్రవారం తెల్లవారుజామున కుంగిపోయింది. దీంతో అధికారులు స్పందించి ముందు జాగ్రత్త చర్యగా వంతెన మీదు నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సుమారు 14 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన కుంగిపోవడంతో మాడుగుల నియోజకవర్గంలోని మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాలతోపాటు, చోడవరం నియోజకవర్గంలోని కొన్ని పంచాయతీలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంతెన సమీపంలో కొంతకాలంగా సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల వల్ల పిల్లర్ల వద్ద గోతులు ఏర్పడడంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో వరద పెరిగి, వంతెనకు దిగువన పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ కారణంగానే వంతెన కుంగిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజల వినతి మేరకు 2011లో విశాఖ డెయిరీ నిధులతో అప్పటి చైర్మన్ ఆడారి తులసీరావు వంతెన నిర్మించారు. డెయిరీ ఇంజనీరింగ్ అధికారులే వంతెన నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు వంతెన కుంగిపోవడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలను కట్టడి చేయకపోవడం, వంతెన నిర్మాణ సమయంలో పిల్లర్స్‌ను లోతుగా వేయకపోవడం వల్ల కుంగిపోయిందని స్థానిక పాలసంఘం అధ్యక్షుడు కోవెల జగన్నాథరావు అభిప్రాయపడ్డారు.



మధుర ఫలాలతో నూకాంబిక అమ్మవారికి అలంకరణ

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అనకాపల్లిలోని శ్రీ నూకాంబిక అమ్మవారిని వివిధ రకాల మధుర ఫలాలతో అలంకరించారు. పలు రకాల పండ్లను మాలలుగా తయారు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

-అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

పచ్చదనంపై వేటు!

విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం విచ్చలవిడిగా చెట్లు నరికివేత

- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
- పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని స్థానికుల ఆందోళన



తిమ్మనపాలెం జంక్షన్ నుంచి కన్నంపాలెం వరకు రహదారి పక్కన చెట్లను నరికివేయడంతో మిగిలిన మానులు





చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

పచ్చదనం పెంచడానికి మొక్కలు నాటడం, వనాలు పెంచే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుంటే.. మరోపక్క విద్యుత్ లైన్ల ఏర్పాటు పేరుతో ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేస్తున్నారు. రైతులు పెంచుకుంటున్న చెట్లతోపాటు, ఉపాధి హామీ పథకం కింద పెంచిన చెట్లను కూడా విచ్చలవిడిగా కొట్టివేస్తున్నారు.

మండలంలో గృహ, వ్యవసాయ అవసరాలకు వేరువేరుగా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ఈపీడీసీఎల్ కనస్ట్రక్షన్ విభాగం ఆధ్వర్యంలో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో వైర్లకు అడ్డుగా వున్న చెట్ల కొమ్మలను నరికివేయడంలో ఎవరికీ ఎటువంటి అభ్యంతరం వుండదు. కానీ కాంట్రాక్టర్‌కు చెందిన సిబ్బంది.. చెట్ల మొదళ్ల వరకు నరికివేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో బెన్నవోలు, జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం పంచాయతీల మీదుగా విద్యుత్ లైన్లు వేసే పనులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా వున్నాయంటూ రోడ్డు పక్కన ఉన్న చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డం వచ్చే చెట్లను గుర్తించి, వాటి కొమ్మల వరకే కొట్టివేసే అవకాశం ఉన్నప్పటికీ, చెట్లను పూర్తిగా నరికివేయడంపై మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మండలంలో తిమ్మనపాలెం జంక్షన్ నుంచి కన్నంపాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పథకం నిధులతో గతంలో మొక్కలు నాటారు. ఇవి ఏపుగా పెరిగి చెట్లుగా ఎదిగాయి. పచ్చదనంతోపాట ... మిగతా 8వ పేజీలో

డీఎస్సీ ఫలితాలు విడుదల



ఎస్జీటీలో 92.9 మార్కులతో మొదటి ర్యాంకు సాధించిన గనివాడ సుజాత

- 92.58 మార్కులతో ద్వితీయ స్థానంలో తాటికొండ ధనలక్ష్మి
- ఈ కేటగిరీలో 14,595 మందితో మెరిట్ జాబితా

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. సెకండరీగ్రేడ్ టీచర్ల నియామకాల కోసం నిర్వహించిన రాత పరీక్షకు హాజరైన 14,595 మందికి వచ్చిన మార్కుల ప్రాతిపదికన మెరిట్ జాబితా విడుదల చేశారు. మొదటి నాలుగు స్థానాలు మహిళా అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. జిల్లాలో అత్యధికంగా 92.9 మార్కులతో గనివాడ సుజాత మొదటి ర్యాంకు సాధించారు. తాటికొండ ధనలక్ష్మి 92.58 మార్కులతో ద్వితీయ స్థానం, కొల్లి శారద 92.02 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. జాబితాలో 14,595వ ర్యాంకు సాధించిన వ్యక్తికి 14.22 మార్కులు వచ్చాయి. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులు ఉండగా అందులో సెకండరీ గ్రేడు టీచర్ (ఎస్జీటీ) పోస్టులు 574 (ఏజెన్సీతో కలిపి) ఉన్నాయి. మిగిలిన 565 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు.

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఫిజికల్ సైన్స్ పరీక్ష రాసిన 1,360 మందికి వచ్చిన మార్కులతో విడుదల చేసిన జాబితాలో ఎస్.శ్రీనివాస్ 82.87 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. వెలగా ఎర్రాపాత్రుడు 81.78 మార్కులతో ద్వితీయ స్థానం, గండేపల్లి హరికృష్ణ 80.66 మార్కులతో తృతీయ స్థానం సంపాదించారు. గణితం సబ్జెక్టులో సుంకరం విజయ్ 94.67 మార్కులతో ప్రథమ స్థానం, కూనబిల్లి పద్మ 88.06 మార్కులతో ద్వితీయ, సరిపల్లి శ్రీనివాస్ 84.11 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. బయాలజీలో బోకం అనిత 89.71 మార్కులతో ప్రథమ, రెడ్డి మంగవిజయ 88.14 మార్కులతో ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుని మృతి

- అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న త్రిచక్ర వాహనం
- మరొకరికి గాయాలు



చింతల బాలాజీ (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంకీ ఫైర్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తానాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు చింతల బాలాజీ(38), ఈరుగుల సూరిఅప్పారావు కలిసి శుక్రవారం సాయంత్రం స్వగ్రామం నుంచి మూడు చక్రాల హోండా యాక్టివాపై లంకెలపాలెం బయలుదేరారు. రాంకీ ఫైర్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో ఇద్దరూ రోడ్డుపై తుళ్లి పడ్డారు. బాలాజీ తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. సూరిఅప్పారావుకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత అగనంపూడి సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలాజీ మృతిచెందినట్టు చెప్పారు. ఇతనికి భార్య ముత్యాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. సొంతూరులో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అందిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలమంచిలి బస్టాండ్ కళకళ

'స్త్రీ శక్తి' పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీ

- ఉచిత ప్రయాణాన్ని ఆలయాల దర్శనంతో ప్రారంభిస్తున్న మహిళలు



ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు



పాయకరావుపేట వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కుతున్న మహిళలు, విద్యార్థినులు

ఎలమంచిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తరువాత ఎలమంచిలి బస్టాండ్ నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీగా సందడి వాతావరణం నెలకొంది.

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. 'స్త్రీ శక్తి' పథకాన్ని ఈ నెల 15వ తేదీన ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎలమంచిలి వరకు /మీదుగా రాకపోకలు సాగించే ఆయా బస్సుల్లో ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) పెరుగుతూ వస్తున్నది. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎలమంచిలి ... మిగతా 8వ పేజీలో

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కుంకుమార్చనలు



వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అచ్యుతాపురం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అచ్యుతాపురం- మార్టూరు రోడ్డులో గల వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అచ్యుతాపురం, వెదురువాడ, చోడపల్లి, మోసయ్యపేట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు విచ్చేశారు.కారుమూరి గోపి, రవి, కన్నబాబు, నానాజీ, శివరాం, గోపి, మల్లికార్జునరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యువకుడిపై దాడి :12 మందిపై కేసు

ఎలమంచిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినషేకిళ్లపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై పెదషేకిళ్లపాలెం గ్రామానికి చెందిన పలువురు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర వెల్లడించిన వివరాలిలా వున్నాయి. కశింకోట మండలం అచ్యుతాపురంలో గురువారం రాత్రి నల్లమారెమ్మ పండుగ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం వద్ద పెదషేకిళ్లపాలెం గ్రామానికి చెందిన భీముని అశ్విన్‌కు, చిన్నషేకిళ్లపాలెం గ్రామానికి చెందిన మెంట్రెడ్డి చంటి, మరిశా శంకర్‌లకు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ విషయాన్ని స్థానికులు మెంట్రెడ్డి చంటి అన్న గోవింద్‌కు ఫోన్ చేసి చెప్పారు. కొద్దిసేపటి తరువాత అతను వచ్చి తమ్ముడిని ఇంటికి తీసుకెళ్లిపోయాడు. అయితే భీముని అశ్విన్ పెదషేకిళ్లపాలెంలో ఇంటికి వెళ్లి, మరో 11 మందిని వెంటపెట్టుకుని రాత్రి 11.30 గంటల సమయంలో మెంట్రెడ్డి చంటి ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగాడు. ఈ సందర్భంగా చంటి అన్న గోవింద్‌పై దాడి చేసి, తలపై గాయపరిచారు. అనంతరం మరిశా శంకర్ ఇంటి వద్దకు వెళ్లి అతనితో గొడవపడి, భార్య మెడలో ఉన్న బంగారు గొలుసు తెంచేసి వెళ్లిపోయారు. గాయపడిన గోవింద్‌ను కుటుంబ సభ్యులు ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రి తరలించారు. ఇతని తల్లి వరహాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ తెలిపారు.

ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

మునగపాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరైనట్టు జడ్పీటీసీ పెంటకోట స్వామిసత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పనులు ప్రారంభించి మాట్లాడారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, ఎంపీటీసీ సూరిశెట్టి రమణ, బీజేపీ నాయకుడు బద్దెం సూర్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, వైసీపీ మండల అధ్యక్షుడు ఆదారి గణపతి అచ్చింనాయుడు పాల్గొన్నారు.

సమతుల్య ఎరువులతో సత్ఫలితాలు

▸ వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడి ▸ పలు గ్రామాల్లో వరినారు మడులు పరిశీలన ▸ చీడపీడల నివాణకు రైతులకు సూచనలు



అచ్యుతాపురం అందలాపల్లిలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త భవానీ బృందం

అచ్యుతాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వరిలో ముందస్తు చర్యల ద్వారా మేలు జరుగుతుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి.భవానీ అన్నారు. మండలంలోని హరిపాలెం, అందలాపల్లిలలో శుక్రవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. వరినారు మడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం నారుమడులు చాలా చోట్ల ఆరోగ్యంగానే ఉన్నాయని, కొన్ని చోట్ల మాత్రమే ఈగ ఆశించిందని తెలిపారు. ఐదు సెంట్ల నారుమడికి ఎనిమిది వందల గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లడం ద్వారా వరి ఈగ, ఆకు ముడత పురుగు, కాండం తొలుచు పురుగులను నివారించవచ్చునని రైతులకు సూచించారు. చివరి దమ్ములో సూటి ఎరువులైన సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 150 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలు, యూరియా 30 కిలోలు వరకు వేసుకోవచ్చని వివరించారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడని పక్షంలో ఎకరాకు యాభై కిలోల డీఏపీ, ఇరవై కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడవచ్చునన్నారు వీలైనంత వరకు వరుసలలో నాట్లు వేసుకోవడం ద్వారా చీడపీడల ఉధృతి తగ్గించవచ్చునన్నారు. ఒక వేళ చీడపీడలు ఆశించినా సులభంగా నియంత్రించుకోవచ్చని వివరించారు. కలుపు ఉధృతంగా ఉంటే నాటిన మూడు రోజులకు ప్రిటిలాక్లోర్ కలుపు మందు ఎకరాకు నాలుగు వందల నుంచి ఐదు వందల ఎంఎం, 20 కేజీల పొడి ఇసుకలో కలిపి బురద పదునుమీద ఎకరా పొలంలో చల్లడం ద్వారా నివారించవచ్చునన్నారు. ఈ బృందంలో ఎలమంచిలి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీబీజీఎస్ కుమారి, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, స్థానిక వ్యవసాయాధికారి శంకర గోవింద, వ్యవసాయ సహాయకులు నీరజ తదితరులు ఉన్నారు.

రాంబిల్లి : మండలంలోని మామిడివాడ, కట్టుపాలెం, నారాయణపురం, తెరువుపల్లి, దిమిలి గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవానీ, ఎలమంచిలి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కుమారి, బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సి.సుమంత రైతులకు పలు సూచనలు చేశారు. పంటలను ఆశించే చీడపీడలను ఎలా నివారించాలో వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ విస్తరణాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

26న ఎలమంచిలి మండల సర్వసభ్య సమావేశం

ఎలమంచిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా కోరారు. మండలంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించనున్నామన్నారు.

'ముఠా కార్మికుల జిల్లా మహాసభ విజయవంతం చేయండి'

అచ్యుతాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అచ్యుతాపురంలో ఈ నెల 26న నిర్వహించనున్న ముఠా కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ముఠా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రొంగలి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ముఠా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నామన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేసి ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నరసింగరావు, సత్తిబాబు, వాసు, తాతారావు, శంకర్రావు, గణేశ్ పాల్గొన్నారు.

పక్కాగా 'స్వమిత్వ' సర్వే

▸ నాలుగు మండలాల సిబ్బంది సమావేశంలో డీఎల్‌డీవో మంజులా వాణి



సమావేశంలో పాల్గొన్న డీఎల్‌డీవో మంజులా వాణి

అచ్యుతాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'స్వమిత్వ' సర్వేను పక్కాగా నిర్వహించాలని డీఎల్‌డీవో మంజులా వాణి సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామ కంఠం భూములు, నిర్మాణాలు, ఖాళీ స్థలాలు కొలతలను క్యూబీఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని భూవివరాలు సక్రమంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అచ్యుతాపురం ఎంపీడీవోలు శ్రీనివాస్‌తో పాటు మిగిలిన మూడు మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో హామీలను అమలు చేయాలి : ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రాంబిల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని వాడనర్సాపురంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం తగదని వాపోయారు. ఎన్ఏవోబీ ఏర్పాటుతో నిర్వాసితులైన మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిశోర్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవిరి రామకృష్ణ సర్పంచులు కారే రామారావు, బి.హరి, ఎంపీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'ఎరువుల కొరతపై అధికారులు దృష్టి సారించాలి'

మునగపాక ఆగస్టు 22 (ఆం ధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత ఏర్పడిందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పనులు జరుగుతున్న తరుణంలో ఎరువులు సమృద్ధిగా లేకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే దృష్టి సారించకుంటే ఈనెల 26న ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీను, ఆదారి త్రిమూర్తులు, సుందరపు నీలకంఠస్వామి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు ఆదారి గణపతి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.





వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత, కుటుంబ సభ్యులు... హాజరైన నాలుగు మండలాల భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు

▸ హోం మంత్రి అనిత నివాసంలో కార్యక్రమం
▸ వేలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. హోం మంత్రి ఇంటికి వెళ్లే మార్గమంతా వేల సంఖ్యలో మహిళలు రావడంతో కిక్కిరిసిపోయింది. ఇందుకోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. విశాలమైన వేదికను నిర్మించిఅమ్మవారి ప్రతి మను ప్రతిష్ఠించారు. వేదపండితుల బృందం శాస్త్రోక్తంగా హోం మంత్రి అనిత, ఆమె కుటుంబ సభ్యులు, ఇతర మహిళా భక్తులతో వరలక్ష్మీ వ్రతం పూజలు చేయించారు. అష్టోత్తర శతనామార్చన, శ్రీసూక్తం, దుర్గా సూక్తంతో వేదపండితుల బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించింది. అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతం పూజలు చేయడం వెనుక వున్న పరమార్థాన్ని వేద పండితులు వివరించారు. వేలాది మంది మహిళలకు హోం మంత్రి అనిత వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతం చేయడమంటే మహిళలంతా పెద్ద పండుగలా భావిస్తారన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన మహిళలు తనను ఆశీర్వదించడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వుండాలని, ఎన్‌డీఏ ప్రభుత్వంలో అందరికీ మంచి జరగాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్యదేవి, బత్తుల అరుణ పాల్గొన్నారు.

కోనవానిపాలెంలో నేత్రదాన నమోదు కార్యక్రమం



అవయవ దాన నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ పరిధి కోనవానిపాలెం గ్రామంలో శుక్రవారం నేత్ర దాన నమోదు కార్యక్రమం నిర్వహించారు. సినీనటుడు మెగస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కుసుమ కావ్య ఫౌండేషన్, మెగా అభిమానుల ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నేత కోన అప్పలరాజు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురు న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌అధినేత డాక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ కార్నియాపై అవగాన కల్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సేనాపతి బాబూరావు, టీడీపీ సీనియర్ నేత అప్పలరాజు మాట్లాడుతూ నేత్ర దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం (కార్నియా) చేసేందుకు తమ పేర్లను నమోదు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మామిడి నాగరాజు, దారబోయిన సత్యనారాయణ, కోన దుర్గప్రసాద్, అప్పికొండ లోవరాజు, కోన గుర్రాచార్యులు, దుర్గబాబు, మురళికృష్ణ, రామకృష్ణ, గుర్రం ధన, దమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

ఎస్. రాయవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సెక్షన్ ధర్మవరం అగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ధర్మవరం అగ్రహారం ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్‌లోని వమ్మవరం, గొడ్డపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ సభ్యుడు లోవరాజు తెలిపారు. కేజీబీవీలో శుక్రవారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పిల్లల అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఉన్నతంగా చదువుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలీమా, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

గో రక్షణకు నక్కపల్లి పోలీసుల కృషి

గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ



సీఐ కుమారస్వామికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ, జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా గోవుల రక్షణకు నక్కపల్లి పోలీసులు కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ కె.కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబును సమాఖ్య ప్రతినిధులు కేవీఆర్ సత్యనారాయణ, చింతలపూడి రూపవతి, శాంతి, నీలాపు దేవి తదితరులతో కలిసి దుశ్శాలువలతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సుమారు రూ.10 లక్షల విలువైన గో మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని భూమిలో పాతిపెట్టించడం శుభపరిణామమని పేర్కొన్నారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. శుక్రవానం మండలంలోని చందనాడ పంచాయతీ శివారు తుమ్మలపేట గ్రామంలో నిర్వాసితులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం భూములు, ఇళ్లను త్యాగం చేస్తున్న నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.అప్పలరాజు, ఎం.రాజేశ్ పాల్గొన్నారు.

పద్యపఠన పోటీల్లో ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనంత ఛందం- అనర్ఘ శతక పద్య పఠనం సంస్థ వ్యవస్థాపకులు తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గత కొంతకాలంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న బాలల పద్య పఠన పోటీల్లో ప్రతిభకనబర్చిన పెదబోదిగల్లం హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం హెచ్ఎం జయశ్రీ, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్ఎం జయశ్రీ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధించడంతో పాటు అనంత ఛందం అనే సంస్థ శతక పద్యపఠనంపై పూర్తి స్థాయిలో పిల్లలకు ఆసక్తి, పరిజ్ఞానం కలిగేలా ఎంతో ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గుణరావు, కుమారి, పద్మావతి, నాగేశ్వరరావు, రమేశ్‌బాబు,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదినం

నక్కపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మెగా అభిమానిగా గుర్తింపు పొందిన మీగడ సత్తిబాబు నివాసం వద్ద అభిమాన సంఘ ప్రతినిధులు లంక శ్రీనివాసరావు, మీగడ సత్తిబాబు, దుర్గాప్రసాద్, తూము కామేశ్, పెదిరెడ్డి రమేశ్, సత్యనారాయణ, ఎ.సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలోపూజలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న పరమేశ్వరరావు

కొత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు వీటిని అందజేశారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల వరకు పంపిణీ చేస్తామన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు, గ్రీన్ క్లబ్, దైట్ ఇంజనీరింగ్ క్యాంపస్ తదితర సంఘాలు, హిందూ సంస్థలతో పాటు పలువురు వారివారి పేర్లపై పలు ప్రాంతాల్లో సుమారు 60వేల విగ్రహాలు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఆలయ ప్రతినిధులు కోటిపల్లి కిశోర్, బోయిన రమణాజీ, బొడ్డేడ నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు పలకా రవి, జనసేన నాయకుడు కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'పై మహిళల స్పందన తెలుసుకున్న మళ్ల


బస్సులో ప్రయాణిస్తున్న మళ్ల సురేంద్ర, డీపీటీవో ప్రవీణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పలువురు మహిళా ప్రయాణికుల స్పందనను గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే బస్సులో కొంతదూరం వరకు డీపీటీవో వి.ప్రవీణ, డిపో సహాయ మేనేజర్ గౌరీలతో కలిసి ప్రయాణం సాగించారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణం ఎలా ఉందని సురేంద్ర మహిళా ప్రయాణికులను అడిగారు. వారంతా చక్కగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే వారందరికీ పథకాన్ని అమలు చేస్తుందని, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇస్తుందని, మహిళలకు రాష్ట్రమంతటా ఎక్కడకు వెళ్లినా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని వివరించారు.

లారీల కాలుష్యం నుంచి కాపాడాలని రాస్తారోకో



లంకెలపాలెం వద్ద రాస్తారోకో చేపడుతున్న సీఐటీయూ శ్రేణులు

పరవాడ (లంకెలపాలెం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు, ఫ్లైయాష్ లారీల ద్వారా వెలువడే కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం లంకెలపాలెం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు పరిమితికి మించి లోడుతో రాకపోకలు సాగించడం వల్ల తీవ్రమైన కాలుష్యం వెదజల్లుతోందన్నారు. అలాగే ఎన్టీపీసీకి చెందిన యాష్‌పాండ్ నుంచి ఫ్లైయాష్‌తో రవాణా సాగించే లారీల కారణంగా విపరీతమైన దుమ్ము, ధూళి ఎగసిపడుతున్నట్టు చెప్పారు. ఫలితంగా లంకెలపాలెం, పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం వెంకటరావు, కె.వెంకటస్వామి, ఎస్.నానాజీ, అప్పారావు, శ్రీను, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కొత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పిసినికాడ సాయినగర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకొని అక్రమంగా వేసిన లేఅవుట్‌లో పంచాయతీ కార్యదర్శి నాగేష్ తన సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో కబ్జాదారులు అనుమతులు లేకుండా, ఎటువంటి పన్నులు చెల్లించకుండా లే అవుట్‌లు వేసేందుకు హద్దులు సూచించే రాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆ రాళ్లను తొలగించి పంచాయతీ లేదా, వుడా నుంచి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో గ్రావెల్‌ను కప్పివేసి, అక్రమ నిర్మాణాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

ఆధునిక పద్ధతుల్లో యువత సాగు చేపట్టాలి



కిశోర్‌కుమార్‌ను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక పద్ధతుల్లో యువత వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కర్షక దేవోభవ మిషన్ నేషనల్ చైర్మన్ ఆడారి కిశోర్‌కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'అనకాపల్లి- మన రైతాంగం' పేరిట ఇక్కడ నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను అంతా గౌరవించాలన్నారు. ప్రభుత్వాలే అన్ని పనులు చేయలేవని, రోటరీ వంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ఆయా పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రకాశరావు, బుద్ద సత్యనారాయణ, రమణాజీ, బుచ్చిరాజు, అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వినియోగంలోకి సామాజిక మరుగుదొడ్లు



పరవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):వాడచీపురుపల్లిలో సామాజిక మరుగుదొడ్లును ఎట్టకేలకు అధికారులు వినియోగంలోకి తెచ్చారు. నాలుగేళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా రూ. 16.5లక్షలతో వీటిని నిర్మించారు. మూడేళ్ల పాటు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం వీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. గత ఏడాది నిర్వహణ బాధ్యతలను పంచాయతీకి అప్పగించింది. అప్పటి నుంచి ఇవి మూతపడ్డాయి. దీంతో వాడచీపురుపల్లి ప్రాంతానికి వివిధ పనులపై వచ్చే వారంతా అత్యవసరానికి ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకువచ్చారు.

నూకాంబిక ఆలయంలో కోలాహలం

▶▶ కుంకుమ పూజలకు భారీగా తరలి వచ్చిన మహిళలు ▶▶ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్


ఆలయ మండపంలో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం శ్రావణ శుక్రవారం సందర్భంగా కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. తొలుత వేకువజామున అమ్మవారిని విశేషంగా అలంకరించి, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆలయానికి విచ్చేయడంతో ఈవో కె.ఎల్.సుధారాణి ఆమెకు స్వాగతం పలికారు. బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొనడంతో కలెక్టర్ వారి వద్దకు వెళ్లి కలిశారు. అనంతరం ఆమెను ఈవో సుధారాణి, మాజీ ధర్మకర్తలు సత్కరించి అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు.

కనకదుర్గమ్మ ఆలయంలో కోటి కుంకుమార్చన

కొత్తూరు : సత్యనారాయణపురం పంచాయతీలోని కళ్యాణగిరిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కోటి కుంకుమార్చనలు జరిపారు. తెల్లవారుజామున అమ్మవారిని విశేషంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోటిపల్లి వెంకటరమణ కిశోర్, ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన


కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చన

రమణాజీ, అన్నదాన కమిటీ చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు, మార్పూరు నాయుడు, అర్చకులు పులఖండం రంగనాథాచార్యులు, రేజేటి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో బ్లాక్ స్పాట్‌ల పరిశీలన


బయ్యవరం వద్ద బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కశింకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బ్లాక్ స్పాట్‌లను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ఎన్‌హెచ్ఐ రాజమండ్రి మేనేజర్ నవీన్, సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బయ్యవరం, తాళ్లపాలెం, కశింకోట కూడలిల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం ప్రధానంగా ప్రమాదాలు ఏ కారణంగా జరుగుతున్నాయో అంచనా వేసి, వాటి నివారణకు పలు సూచనలు చేశారు.

వినాయక ఉత్సవాల్లో పటిష్ఠ నిఘా : సీఐ


సచివాలయ పోలీసులకు సూచనలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠమైన నిఘా ఉంచాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో గ్రామ సచివాలయ పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ సింగిల్‌విండో విధానంలో అనుమతులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తి చేసే వారికే గుర్తింపు కార్డులివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేముడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తి చేసే వారికే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు, సహాయ కార్యదర్శి బత్తిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం జరిగిన సంఘ జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో బెల్టుషాపులు తొలగించేందుకు వీఆర్వో, సచివాలయ పోలీసులతో కమిటీలు వేయాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా గీత కార్మికులకు రక్షణ కల్పించాలని, ఉపాధికి గ్యారంటీ ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.ఐదు లక్షలు, శాశ్వత దివ్యాంగులకు రూ. పది లక్షలు, తాత్కాలిక దివ్యాంగులకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 30న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నామన్నారు. ఈ సమావేశంలో కట్టా ఈశ్వరరావు, గండిబోయిన రాము, కొలుసు మహాలక్ష్మినాయుడు, టి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

విద్యార్థులు ఉత్తములుగా ఎదగాలి : డీఎంహెచ్‌వో

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మంచి అలవాట్లు నేర్చుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఉద్యోగులు సీఎస్‌వో స్పందన ప్రశాంతి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ రాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో అర్థమయ్యే రీతిలో బోధన


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అకాడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి

కశింకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించి శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని అసిస్టెంట్ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి ఉపాధ్యాయులకు సూచించారు. తేగాడ గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా బోధనపై ఆరా తీశారు. భోజన వసతి ఎలా ఉందో నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెనూ ప్రకారం వంటకాలు చేసిందీ లేనిదీ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తతిలకం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



కేంద్ర ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఈడీ, తదితరులు

సబ్బవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న పథకాలను ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీ ఎంవీ మురళీకృష్ణ కోరారు. గొటివాడలో శుక్రవారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణులకు ఆర్థిక అక్షరాస్యత, సామాజిక భద్రత పథకాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ బ్యాంక్ ఖాతా ఉండాలన్నారు. రీజినల్ మేనేజర్ ఏవీ రమణమూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ చందన్ కుమార్‌దాస్, బ్రాంచ్ మేనేజర్ ఎ.రమేశ్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను వివరించారు. ఎస్ఐ దివ్య మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఫ్రాడ్ కాల్స్, ఓటీపీ మోసాలకు గురికాకుండా ఉండేలా అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌ను అంతా ఆవిష్కరించారు.

సరకు లోడింగ్, అన్‌లోడింగ్‌పై ఆంక్షలు తగవు

▶▶ డీఎస్పీకి ముఠా కార్మికుల సంఘం వినతి


డీఎస్పీ కార్యాలయం వద్ద ముఠా కార్మికులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాలపై అకస్మాత్తుగా విధించిన ఆంక్షలను ఉప సంహరించుకోవాలని ముఠా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ శ్రావణిని కలిసి పరిస్థితులను వివరించారు. అనంతరం జరిగిన ముఠా కార్మిక సంఘం, పార్శిల్, తోపుడు బండ్ల తదితర కార్మికుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో వ్యాపార లావాదేవీలు జరపడానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం సరుకులు వస్తుంటాయన్నారు. ఈ లారీలు మెయిన్‌రోడ్డులో నిలపరని, రావుగోపాలరావు కళాక్షేత్రం రోడ్డు, పప్పులవీధి, కూరగాయల మార్కెట్ వంటి లూప్ లైన్‌ల్లోనే నిలుపుతారన్నారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్ అంతరాయం పేరుతో ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల మధ్య సరుకులతో వాహనాలు పట్టణ పరిధిలోకి అనుమతి లేదని చెప్పడం తగదని వాపోయారు. ఇక్కడ రెండువేల మందికి పైగా ముఠా, కళాసీలు, పార్శిల్, తోపుడు బండ్లు తదితర కార్మికులు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పోలీస్ అధికారుల తాజా నిర్ణ యం వల్ల వీరందరి జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, కాళ్ల తేలయ్యబాబు, బోడి రాజు, కనకల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు


జనసేన కార్యాలయంలో మొక్కనాటుతున్న రాంకీ

కొత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను అనకాపల్లి పట్టణంలోని రింగు రోడ్డులో గల జనసేన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) తొలుత చిరంజీవి అభిమానులు, జనసైనికులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : చిరంజీవి జన్మదిన వేడకలను ఇక్కడి మారుతి జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు తొలుత అంజనేయ ఆలయంలో పూజలు జరిపి, జన్మదిన కేక్ కట్‌చేశారు. అనంతరం గొల్లలపాలెంలోని ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గొటివాడలోని జనరేషన్ యు అనాథ ఆశ్రమంలో పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేశారు. నాయకులు ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, మీన, కర్రి కనకరాజు, బైల పూడి దేముడుబాబు, రోమాల చంద్రశేఖర్, కేవీ సత్య నారాయణ, బోకం స్వామినాయుడు, శేఖర్ పాల్గొన్నారు.


సబ్బవరంలో కేక్ కట్‌చేస్తున్న వెంకటేశ్వరరావు

'డయల్ యువర్ ఏఈ' దృష్టికి విద్యుత్ సమస్యలు


విద్యుత్ సమస్యలు వింటున్న ఏఈ దుర్గాప్రసాద్

తుమ్మపాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఏఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తుమ్మపాల సెక్షన్ పరిధిలో గల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఫోన్ కాల్స్ ద్వారా విద్యుత్ సమస్యలను తెలియజేశారు. పరిష్కార మార్గాలను అక్కడికక్కడే అధికారులు సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ సెక్షన్ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ యువతీ యువకులకు మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గల ఎస్సీ యువతీ యువకులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ శుక్రవారం తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఇరవై సంవత్సరాల వయస్సు పైబడిన ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు నలభై రోజుల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. అర్హులైనవారు షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నంలో గల కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 82వ వార్డు పరిధి పరుశురాంపేట శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలంటూ కార్పొరేటర్ మందపాటి సునీత శుక్రవారం జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ క్రైస్తవులు అంత్యక్రియలు నిర్వహించే సమయంలో నీరు, లైటింగ్, షెల్టర్ వంటి సౌకర్యాలు లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించారు.

ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన

తుమ్మపాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ విధానాలపై వ్యవసాయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.లచ్చన్న సూచించారు. అనకాపల్లిలో గల బయో రీసెర్చ్ సెంటర్‌లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. కషాయాల తయారీ, వినియోగంపై శతశాతం అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా రైతులకు ఈ విధానాలను వివరించి ప్రకృతి వ్యవసాయంపై ఆశక్తి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంటల సంరక్షణపై వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అధికారులు కె.ప్రకాష్, జానకి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి విగ్రహాలు సిద్ధం

» పాడేరులో వివిధచోట్ల దుకాణాలు ఏర్పాటు

» గ్రామాల నుంచి వచ్చి ఉత్సవ కమిటీలు కొనుగోలు

పాడేరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు పట్టణాలు, గ్రామాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న పండగ కోసం పట్టణంలో వివిధ రూపాల్లో విగ్రహాల విక్రయాలను ప్రారంభించారు. మైదాన ప్రాంతంలోని తుని, అడ్డూరు, వడ్డాది, సబ్బవరం, రావికమతం తదితర ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహ వ్యాపారులు పాడేరుకు భారీ ఎత్తున విగ్రహాలను తీసుకువచ్చి నెల రోజులకు ముందుగానే అమ్మకాలకు సిద్ధం చేశారు. పాడేరు డివిజన్ పరిధిలోని పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏటా పాడేరు చేరుకొని విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది విగ్రహాలు అధిక ధరలు పలుకుతున్నాయి. విగ్రహాల్లో మోడల్‌ను బట్టి ధరలు ఉన్నాయి. ఈ ఏడాది ఒక్కో విగ్రహం రూ. 2వేల నుంచి రూ. 20 వేల వరకు అమ్మకాలు చేపడుతున్నారు. మూడు అడుగుల విగ్రహం రూ. 3 వేలు నుంచి రూ. 3,500, నాలుగడుగుల విగ్రహం రూ. 4,500 నుంచి రూ.5 వేలు, ఐదడుగుల విగ్రహం రూ. 7 వేలు, ఎనిమిదడుగుల విగ్రహం రూ. 9 వేలు, 10 అడుగుల విగ్రహం రూ. 18 వేల నుంచి 20 వేల వరకు విగ్రహం మోడల్‌ను బట్టి అమ్మ కాలు చేపడుతున్నారు. ఇప్పటికి మండలంలోని చుట్టుపక్కల గ్రామాలు, వివిధ మండలాలకు చెందిన వినాయక ఉత్సవ నిర్వాహకులు పాడేరుకు చేరుకుని వారికి నచ్చిన విగ్రహాలకు అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్నారు. చవితికి ఒకటి రెండు రోజులు ముందు వాహనాలను తీసుకు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

వచ్చి విగ్రహాలను, మండపం అలంకరణ, పూజా సామగ్రిని కొనుగోలు చేసుకుని వెళ్తారు.

అలంకరణ బట్టి ధరలు



వినాయక విగ్రహాలు ఈ ఏడాది తయారీ దారుల వద్దే అధికంగా ధరలు పలుకుతున్నాయి. విగ్రహ అలంకరణ బట్టీ ధరలను పెంచారు. అలవాటైన వ్యాపారం కావడంతో అమ్మకాలు చేపడుతున్నాం. విగ్రహాలుఅమ్మకాలుబాగా సాగితే నష్టం ఉండదు. లేకుంటే లభాలు సంగతి పక్కన పెడితే ఖర్చులు కూడా ఈ ఏడాది వచ్చే అవకాశం లేవు.

- కాసులూరి సత్తిబాబు,
విగ్రహాల వ్యాపారి, రావికమతం

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఈనెల 27తేదీ వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా రెండు మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 12.7మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 75-82శాతం ఉంటుందన్నారు.

'హైవే పనుల్లో నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి'

పాడేరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మృతి చెందిన పలాసి సోమేశ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. జి.మాడుగుల మండలం కె.కోడాపల్లిసమీపంలో జాతీయ రహదారి నిర్మిస్తున్న సుధర్మ కంపెనీ నిర్లక్ష్యం వల్ల గిరిజన యువకుడి సోమేశ్ నిండుప్రాణం పోయిందన్నారు. ముందస్తు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. కల్వర్టు కోసం తీసిన గొయ్యిలో నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పీ 4 స్ఫూర్తితో గిరిజన రైతులకు దుక్కిటెద్దులు పంపిణీ

పాడేరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీ4 కార్యక్రమం స్ఫూర్తితో మండలంలోని గబ్బంగి గ్రామానికి చెందిన నాలుగు గిరిజన పేద రైతు కుటుంబాలకు ఆరు దుక్కిటెద్దులను అందించినట్టు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్. వి.జయరాజ్ తెలిపారు. విజయనగరం నందిని వనం గోశాల నుంచి ప్రభుత్వం సమకూర్చిన ఈ దుక్కిటెద్దులను పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.పి.వేనుమాధవ్‌తో కలిసి శుక్రవారం రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశు సంరక్షణ, యాజమాన్యం దృష్ట్యా రైతులకు జొవార్ గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. అలాగే, ఇటీవల తుఫాన్‌కు ఎక్కడైనా పశువులు మృతి చెందితే వెం టనే సంబంధిత పశువైద్యులకు సమాచారం అందించాలన్నారు. ఈ బాధితులకు ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల నుంచి పరిహారమందించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గబ్బంగి సర్పంచ్ బి.చిట్టిబాబు, డోకులూరు లైవ్ స్టాక్ అ ధికారి కె.సురేశ్, గ్రామపెద్దలు సత్యారావు, కొండబాబు, సుబ్బారావు, రాజుబాబు పాల్గొన్నారు.


గిరిజన కుటుంబాలకు దుక్కిటెద్దులకు అందిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారులు

పిల్లల దత్తత అంశంలో నిబంధనలు తప్పనిసరి: జేసీ


పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ అభిషేక్ గౌడ, ఇతర అధికారులు

పాడేరురూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తత అంశంలో నిబంధనలు అనుసరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అడాప్షన్ కేర్ పోస్టర్లను శుక్రవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని ఆరేళ్లపైబడి 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను రెండేళ్లపాటు పెంచి ప్రేమానురాగాలు పంచిన అనంతరం శాశ్వత దత్తత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో కె.పద్మలత, డీఈవో పి.బ్రహ్మాజీరావు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, డీసీపీవో డాక్టర్.టి.సద్దు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ


చింతపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. రెవెన్యూ కార్యాలయం వద్ద విద్యార్థులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం చెల్లిస్తున్న మెస్ చార్జీలు రూ. 3వేలుగా పెంచాలన్నారు. జీవో 77 రద్దుచేయాలని, తక్షణమే బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభాశ్, శ్రావని, మౌనిక పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

అరకులోయ,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ తేదేపా ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర నిర్వహించిన గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శుక్రవారం స్థానిక తన స్వగృహంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు విచ్చేసి సమస్యలపై విన్నవించారు. గ్రామాలకు రహదారులు నిర్మించాలని, తాగునీటి పథకాలు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యక్తిగత సమస్యలపై వినతులు స్వీకరించారు. రహదారులు, డ్రైనేజీలు, వంతెనలు, సీసీ రోడ్లకు సంబంధించి ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని దొన్నుదొర తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనంద్, మాజీ సర్పంచ్ పాంగి సుబ్బారావు, కొర్రా సీతారామ్, శంకర్, లైచోన్, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, పాంగి రవీంద్ర, కొర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి పంచాయతీ పరిధిలోని చిట్టంగరువు గ్రామానికి రూ.35లక్షల పీఎం జన్‌మన్ పథకం నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. లంబసింగి నుంచి చిట్టంగరువు గ్రామానికి వెళ్లేందుకు గల కిలో మీటరు మేర రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర శాంతి, ఐటీడీపీ మండల ఇన్‌చార్జి వి. మహేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమలింగం, నాయకులు కిముడు లక్ష్మయ్య, పార్వతి, పెసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాజులబంధలో వైద్య శిబిరం

కొయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మూలపేట పంచాయతీ జాజుఉలబంద గ్రా మంలో డౌనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె. వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 26 మందికి బీపీ, షుగర్ తదితర ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఇద్దరికి జ్వరంతో ఉన్నట్టుగా గుర్తించి మందులు పంపిణీ చేశారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న మర్రి రామారావుకు మందులందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ రాణి, ఏఎన్ఎం సత్యవతి, నాగరత్నం పాల్గొన్నారు.

యండపల్లివలసలో చర్చి, పాస్టర్ ఇంటిపై దాడి

అరకులోయ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధి యండపల్లివలసలోని ఆమెన్ చర్చి, అందులోని పాస్టర్ నివాసముంటున్న ఇంటిపై గ్రామానికి చెందిన కొందరు దాడికి ప్రయత్నించినట్టు ఆరోపణలపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా పాస్టర్ యేసుపాదం, సంఘ సభ్యులు మాట్లాడుతూ, శుక్రవారం మధ్యాహ్నం 12.30 సమయంలో యండపల్లివలసకు చెందిన 20 మంది ఈ సంఘటనకు పాల్పడినట్టు తెలిపారు. 50 ఏళ్ల నుంచి తాను గ్రామంలో కుటుంబసభ్యులతో జీవనం సాగిస్తున్నామన్నారు. ఆమెన్‌చర్చి ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాను ఉంటున్న ఈ స్థలం ఇచ్చిన వారితో లావాదేవీలన్నీ ఎప్పుడో పూర్తి చేసినట్టు చెప్పారు. 50 ఏళ్ల కిందట ఈ స్థలం తమకు ఇచ్చిన కుటుంబ సభ్యుల ద్వారా కొందరు తమ స్వలాభం కోసం ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. ఏడాదిగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ సంఘటనల వెనుక పట్టణంలో ఓ న్యాయవాది, అనంతగిరి మండలానికి చెందిన వ్యక్తి ఉన్నారని వారు ఆరోపించారు. ఇందులో భాగంగానే శుక్రవారం గ్రామానికి చెందిన కొందరు ఇంటి గేటుపైనుంచి దూకి సామగ్రి చిందరవందరచేసి తీవ్రభయందోళనకు గురిచేశారన్నారు. గదిలో ఉన్న తనను చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయంపై టీడీపీ అరకు ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్‌కు దొన్నుదొరను పాస్టర్ యేసుపాదం, అరకులోయ యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ ప్రతినిధులు, క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు కలిసి ఈ దాడిని వివరించారు. స్పందించిన దొన్నుదొర పోలీసులతో మాట్లాడారు. చర్చిపై దాడికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేయాలని కోరారు. ఈ సంఘటనపై తగు చర్యలు తీసుకుంటామని, పాస్టర్ కుటుంబానికి రక్షణ కల్పిస్తామని సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు ఈ సందర్భంగా తెలిపారు.


టీడీపీ అరకు ఇన్‌చార్జికు దొన్నుదొరకు వినతిపత్రమిస్తున్న పాస్టర్ యేసుపాదం, క్రైస్తవ సంఘాల పెద్దలు

పీఎఫ్ బకాయి చెల్లించాలని ధర్నా



ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అరకులో పనిచేస్తున్న కార్మికులు

పాడేరురూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అరకువేలి గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస హెచ్ఎంటీసీ ఫారంలో పనిచేస్తున్న ఐటీడీఏ కార్మికులకు బకాయిపడిన పీఎఫ్‌ను చెల్లించాలని ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద ఈ మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకువేలిలో ఐటీడీఏ పరిధిలోని వివిధ విభాగాల్లో గత పది నుంచి 13 ఏళ్లగా పనిచేస్తున్న సుమారు 50 మంది కార్మికులకు అధికారులు నేటికీ పీఎఫ్ సౌకర్యం కల్పించకపోవడం విచారకరమన్నారు. ఈ ధర్నాలో సంఘ నాయకులు దాడి రాజు, రాంబాబు, రాజు, రాఘవ, జయరాజ్, అర్జున్, రంభ, శాంతి, అప్పలమ్మ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అరకులో పనిచేస్తున్న కార్మికులు

అనంతగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డముకు ఎంపీపీ పాఠశాలఆవరణంలో శుక్రవారం ఏపీటీఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి డి.సన్యాసిరావు, ధనుంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో మండల శాఖ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులుగా ఎల్‌బి.మంజునాథ్, వి.తిరుపతిరావు, కార్యదర్శులుగా పి.మహదేవ్, జె.రామ్, కె.వి.పద్మావతి, ఎస్.నాగరత్నం, ప్రధాన కార్యదర్శి అల్లంగి అద్దు, ఉపాధ్యక్షులు జె.అప్పారావు, డి.అప్పలకొండ, జె. సత్యనారాయణ, పి.లీలావతి, డి.ప్రవీణ్, తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

గుత్తులపుట్టును మండల కేంద్రం చేయాలని వినతి


మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అం దిస్తున్న కమిటీ సభ్యులు

పాడేరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండల పరిధి గుత్తులపుట్టు ను మం డల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ మండల సాధన కమిటీ సభ్యులు శుక్రవారం టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని ఆమె నివాస గృహం కుమ్మరిపుట్టులో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాలకు చెందిన 16 పంచాయతీలకు చెందిన 240 గ్రామాలకు చెందిన 13, 234 కుటుంబాల్లోని 52 వేల మంది ప్రజలకు అనువైన గుత్తులపుట్టు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు వి.సూరిబాబు, ఎం. బాబూజీ, ఎ.ఆనంద్, పి. చందు, రంజిత్, సతీశ్‌పడాల్ పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

పాడేరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్.పి.రోహిణి తెలిపారు. ఈ మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, కేర్ ఫర్ యు, మీషో తదితర 12 కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలో ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఆపై చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్లు : 63026 36174, 75699 23256 సంప్రదించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులపై అసెస్‌మెంట్ పుస్తకాల భారం తగదు : ఏపీటీఎఫ్-257


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

పాడేరురూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అసెస్‌మెంట్ పుస్తకాల భారం నుంచి విముక్తి కలిగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్- 257) జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహనరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు శుక్రవారం డీఈవో పి.బ్రహ్మాజీరావుకు వినతిపత్రమిచ్చారు. పాఠశాలల్లో అసెస్‌మెంట్ పుస్తకాలతో ఉపాధ్యాయులకు అదనపు ఒత్తిడి తప్పా ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఇప్పటికే మాన్యువల్‌గా పేపర్లు దిద్దుతున్నట్టు చెప్పారు. అలాగే, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు రూపంలో మార్కులు నమోదు చేస్తున్నామన్నారు. దీనికి మరింత పని భారం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్, ఎస్.శాంతకుమారి, జె.కృష్ణారావు, ఎల్‌వీ దొర, భైరవమూర్తి, వి.స్వప్న, ఎస్.గిరి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ


ఎన్‌కాస్ సభ్యుల నిర్వహించిన వర్చువల్ తనిఖీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలగెడ్డలో ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం వర్చువల్‌గా ఎన్‌కాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్)లో భాగంగా బెంగాల్, ఒడిశాకు చెందిన ఎక్స్‌టెన్షనల్ ఎస్‌ఎస్‌మెంట్ సభ్యులు, వైద్యాధికారులు భాస్కర్, స్వాతి తనిఖీ చేశారు. భీమవరం పీహెచ్‌సీ పరిధిలోని చిలకలగెడ్డ ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌కాస్‌లో ఎంపిక చేశారు. అయితే, వైద్యసేవలు సబ్‌సెంటర్ పరిధిలో ఏ విధంగా అందుతున్నాయి. అనే అంశాలపై వర్చువల్‌గా వారు ఎంఎల్‌హెచ్‌పీ హేమ, ఎఎన్ఎం జన్ని రత్న కుమారిలను అడిగితెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్, వైద్యాధికారి సూర్యలలిత, పీహెచ్‌సీ వైద్యాధికారులు అనుప్, నాయుడు, ఎంపీహెచ్‌ఈవో నందయ్య, ఎఎన్ఎంలు అప్పలకొండ, కనకరత్నం, గంగాభవాని, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతి ఉండాలి :సీఐ


మాట్లాడుతున్న సీఐ వినోద్ బాబు

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే భక్తులు కచ్చితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల్లో డీజే సౌండ్స్, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. పాఠశాలలు, చర్చిలు, దేవాలయాలు, మసీదులు సమీపంలో, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మండపాలుపెట్టరాదన్నారు. మండపాల్లో క్యూఆర్ కోడ్, ఎన్‌వోసీ ల్యామినేషన్ చేసి ప్రదర్శించాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం ఊరేగింపు నిర్వహించే మార్గం తెలియజేయాలన్నారు. నిమజ్జనం చేసే వాగులు, చెరువుల వద్ద పోలీసుల బం దోబస్తు ఉంటుందన్నారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లకు అనుమతిలేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు, అన్నవరం ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లకు ఘన సన్మానం


పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, ఆ గస్టు 22(ఆంధ్ర జ్యోతి): పాడేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్, డైరెక్టర్లుగా గురువారం బాధ్యతలు చేపట్టిన డప్పోడి వెంకటరమణ, మర్రి కొండబాబు, వంపూరు రమేశ్‌లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు ఆధ్వ ర్యంలో నాయకులు శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నూతన పీఏసీఎస్ చైర్‌పర్సన్, డైరెక్టర్లు గిరిజన రైతుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, తెలుగు మహిళా నేత బొర్రా విజయరాణి, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, రేగం కొండబాబు, ఏవో పాత్రుడు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలు సాధించాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం


కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డుంబ్రిగుడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గురుకుల విద్యాలయంను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. భోజన మెనూపై ఆరా తీశారు. గతేడాది కన్నా ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత చదువుల కు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఇంటర్ విద్యార్థినులు తమకు బెంచీలు సమకుర్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు వెంకటరావు, నాగేశ్వరరావు, హరి, మండల అధ్యకుడు పరశురాం, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భవాని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వంట గ్యాస్ అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


డుంబ్రిగుడలో గ్యాస్ గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ త్రివేణి

డుంబ్రిగుడ, ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్‌ను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ త్రివేణి అన్నారు. శుక్రవారం కించమండ గ్యాస్ గోదాంతోపాటు డుంబ్రిగుడ, అరకు డీఆర్ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత గ్యాస్‌ను అక్రమంగా మళ్లించకుండా నేరుగా అబ్ధిదారులకు అందించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకే గ్యాస్‌ను విక్రయించాలని ఆదేశించారు. ప్రతి నెలా ఉచిత బియ్యం రేషన్ లబ్ధిదారులకు చేరాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

'వికలాంగ పింఛన్లు పునరుద్ధరించాలి'


వికలాంగురాలితో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌బాబు

కొయ్యూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరమైన కారణాలతో నిలిపిన వికలాంగ పింఛన్లు తిరిగి పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు కోరారు. రాజేంద్రపాలెంలో మంచానికే పరిమితమై పింఛను నిలిచిపోయిన సీని జరినాబేగంను ఎంపీపీ శుక్రవారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 113 వికలాంగ పింఛన్లు నిలిచిపోయాయన్నారు. వీరిలో ఇప్పటి వరకు కేవలం 60 మందికి మాత్రమే అధికారులు పింఛన్లు పునరుద్ధరణకు వీలుగా చర్యలు చేపట్టారన్నారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు అవగాహన లేక మిన్నకున్నారన్నారు. మార్గదర్శకాలు సడలించి ఇలాంటి వారందరికి దివ్యాంగ పింఛన్లు పునరుద్ధరించాలని ఎంపీపీ ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఏజెన్సీలో వలిసెల సాగు లాభదాయకం

» ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వలిసెల సాగు లాభదాయకమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో దుశ్చరపాలెం, అసరాడ, ఏబులం దత్తత గ్రామాల రైతులకు వలిసెల సాగుపై శాస్త్రవేత్తలు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ, నూనెగింజల పంటలో వలిసెలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఆదివాసీ రైతులు ఆకాశపందిరి కలుపు వల్ల అత్యధిక సంఖ్యలో రైతులు ఈ సాగుకు దూరమయ్యారన్నారు. గిరిజన రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే ఆకాశపందిని నివారించుకోవచ్చునన్నారు. వలిసెల పంటలో మంచి దిగుబడులు రావాలంటే తేనెటీగలు సహకారం చాలా అవసరమన్నారు. తేనెటీగలకు రైతులు హాని తలపెట్టరాదన్నారు. వలిసెల సాగులో వర్మికంపోస్టు, జీవన ఎరువులను ఉపయోగించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేపడితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అనంతరం రైతులకు వలిసెల విత్తనాలు, జీవన ఎరువులు, వానపాములు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్‌బాబు, సందీప్ నాయక్ పాల్గొన్నారు.


రైతులకు జీవన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని లబ్ధిదారులకు శుక్రవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నాలుగు మండలాలకు చెందిన 18 మందికి రూ.12 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం సహాయనిధి పేద కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తున్నదన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఏడాది కాలకంలో 59 మందికి పైగా లబ్ధిదారులకు సుమారు రూ.46 లక్షలు సీఎంఆర్ఎఫ్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో అండగా నిలిచిన సీఎం చంద్రబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు పాల్గొన్నారు.

దొండపూడి దుర్గాలమ్మను దర్శించుకున్న స్పీకర్



ఆలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే గంటా, నాయకులు

రావికమతం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి గ్రామంలో దుర్గాలమ్మను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వగ్రామైన దొండపూడిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి తొలి పండుగ సందర్భంగా స్పీకర్‌తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చోడవరం, ఎలమంచిలి, విశాఖ పశ్చిమ, విశాఖ దక్షిణం ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, గణబాబు, వంశీకృష్ణ యాదవ్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు, నాయకులు మల్ల సురేంద్ర, దాడి రత్నకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

మట్టి వినాయకులనే పూజించండి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం భక్తులు మట్టి వినాయకులనే పూజించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. శుక్రవారం మాడుగుల వచ్చిన ఎమ్మెల్యే బండారుకు భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మట్టి వినాయకుడిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడానికి అందరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఇందుకోసం కృషి భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులను ఆయన అభినందించారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ


▸▸ జిల్లా మలేరియా నివారణాధికారి సత్యనారాయణ



టి.అర్జాపురంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో

రావికమతం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని జిల్లా మలేరియా నివారణాధికారి ఏజే.సత్యనారాయణ స్పష్ట చేశారు. మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన కొశిరెడ్డి లక్ష్మి జ్వరంతో బాధపడుతుండగా ఎంతకీ తగ్గకపోవడంతో కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ పరీక్షలు చేయగా డెంగ్యూ నిర్ధారణ కావడంతో వైద్యాధికారిణి సురేఖతో కలిసి శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎంవో మాట్లాడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మి ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. డెంగ్యూ కారక దోమల నివారణకు ఇళ్లు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. అలాగే గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, సబ్ యూనిట్ అధికారి రమణ, హెచ్‌వీ ఎర్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ ఫిర్యాదుపై ఎంఈవోల విచారణ



విచారణ సందర్భంగా మాట్లాడుతున్న ఎంఈవోలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సిహెచ్.నాగాపురం పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కాకుండా మాజీ సర్పంచ్ స్వాతంత్ర్య దినోత్సవంలో జెండా ఎగురవేశారని జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎంఈవోలు సత్యనారాయణ, జి.కృష్ణప్రసాద్ తమ బృందంతో విచారణ చేపట్టారు. తొలుత సర్పంచ్‌ను ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఛైర్మన్ జైతి అప్పారావును విచారణ చేశారు. ఈ నివేదిక జిల్లా అధికారులకు అందజేస్తామని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం దిగుమూర్తి శ్రీనువాసరావు, సీఆర్‌పీ సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు వరహాలబాబు, బొప్పన ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

రోలుగుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. రోలుగుంటలో డ్రోన్ కెమెరా నిఘాను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్ వంటి కార్యాకలాపాలకు పాల్పడడం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రవాణాపై డ్రోన్‌తో నిఘా పెట్టామని తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

▸▸ జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు హెచ్చరించారు. నర్సీపట్నంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం నర్సీపట్నం వ్యవసాయాధికారి కార్యాలయంలో నాలుగు మండలాల ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సీపట్నం మండలంలోని 165 టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులు 250 టన్నులు డీలర్ల వద్ద ఉన్నాయన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లో యూరియా 36 టన్నులు రైతులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే యూరియా, కాంప్లెక్స్ ఎరువులు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయన్నారు. డీఏపీ బస్తా (50 కిలోలు) రూ.1300, 28-28 (50 కిలోలు) రూ.1800, రూపాయలు ధర కంటే అధిక ధరలకు డీలర్లు విక్రయిస్తే జిల్లా కంట్రోల్ రూమ్ 8331056471కు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

27 నుంచి స్వయంభూ వినాయక ఉత్సవాలు

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి స్వయంభూ విఘ్నేశ్వరుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు 63 అడుగుల భారీ వినాయక విగ్రహం అదనపు ఆకర్షణ కానున్నదన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, సకురు కోటేశ్వరరావు. వినాయక, శివాలయం కమిటీ ఛైర్మన్లు పసుమర్తి సాంబమూర్తి, గూనూరు సురేష్, దేవదాయశాఖ ఈవో ఎస్.వీ.వీ.సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి, ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



స్వయంభూ ఆలయంలో చవితి ఉత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కె.కోటపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ గల పార్టీ కార్యకర్తలుగా కూటమి ధర్మాన్ని పాటిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఇప్పటి నుంచే ప్రతీ బూత్‌కు కమిటీలు వేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన ఉన్నందున నియోజకవర్గంలోని ముఖ్య సమస్యలను మండల కమిటీలు చర్చించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముందు దేశం తర్వాత పార్టీ అని, తర్వాతే తాను అనే బీజేపీ సిద్ధాంతాన్ని ప్రతీ కార్యకర్త గుర్తుంచుకోవాలని సూచించారు. బీజేపీ సీనియర్ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, మాజీ మండల అధ్యక్షులు కోటాన ఈశ్వరరావు, నాయకులు దొగ్గ ఈశ్వర ప్రసాద్, శరగడం సన్యాసినాయుడు, ఇమంది సన్యాసిరావు, జనపరెడ్డి సూర్యనారాయణ, దొగ్గ రమణ, గజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రేమ సమాజం ఆవరణలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఫ్యాన్స్ ప్రతినిధులు అకుల వాసు, రాజేశ్, మణి, రామకృష్ణ, దుర్గ, శ్రీను, మరిడి, శివ, జ్యోతుల రమేష్, నెహ్రూ, రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం చిరు ఫ్యాన్స్ ఘనంగా నిర్వహించారు. చిరంజీవి జన్మదిన వేడుకలు సందర్భంగా దేవి, మోదకొండమ్మ ఆలయాల్లో చిరంజీవి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక నిర్వహించారు. వృద్ధులకు మాడుగుల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులు అందించారు. పభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు దంగేటి సూర్యారావు, ఎస్.శ్రీనివాసరావు, జవ్వాది వరహాలు, ద్రాక్షారపు రామచంద్రరావు, జి.వెంకటేశ్, సిహెచ్.మధు, జొన్నపల్లి రమేశ్, ఈర్ని సురేశ్, సయ్యపురెడ్డి సత్తిబాబు, లేకేశ్, ఇళ్లపు రమేశ్, బలరాం పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడ సురేశ్ శుక్రవారం చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం నియోకవర్గం ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ చిరంజీవి కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్, నాతవరం మండల అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.


ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు

మాడుగుల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కేంద్రంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లేచి తలంటి స్నానం చేసిన మహిళలు ఇళ్లవద్ద లక్ష్మీదేవికి పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం దేవి, దుర్గాలమ్మ, మోదకొండమ్మ అమ్మవారి ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయాల కమిటీల సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కన్యక పరమేశ్వరీ ఆలయంలో...

దేవరాపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసిడిపల్లిలో కన్యకపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో ఆఖరి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనతో పాటు అభిషేకం నిర్వహించారు. పసుపు కొమ్ముల అమ్మవారికి ప్రత్యేక అలంకణ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి, సిబ్బంది

రోలుగుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని డీఆర్‌సీ అనకాపల్లి ఏవో విజేత పేర్కొన్నారు. మండలంలోని కొంతలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. యూరియాను ఆవసరం మేరకు వాడాలని, ఎక్కువ మోతాదులో వినియోగించవద్దని చెప్పారు. ఎదపంట వల్ల కలిగే లాభాలను, పెట్టుబడులను తగ్గించుకునా మార్గాలను సూచించారు. వరి నాట్లు వేసే సమయంలో కొనలను తుంచి వేస్తే కాండంతొలుచు పురుగు బారి నుండి రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో చిరంజీవి, సిబ్బంది ఉమ, కార్తీక్ పాల్గొన్నారు.

మాడుగుల బస్టాండ్‌లో ఎగ్ కార్ట్ ప్రారంభం



మాడుగుల బస్టాండ్‌లో నూతనంగా ప్రారంభించిన ఎగ్ కార్ట్

మాడుగుల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అందించిన ఎగ్‌కార్ట్‌ను మాడుగుల బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం ప్రారంభించారు. మండలంలో వెనుకబడిన కుటుంబాలకు ఆసరా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మండలంలో బాగా వెనుకబడి ఉన్న పేదలను గుర్తించి, వారి జీవనోపాధికి అధికారులు తగిన దారి చూపించారు. వెనుకబడిన పేదలను గుర్తించిన ప్రభుత్వం వెలుగు సంస్థ ద్వారా రూ. 50 వేలు విలువచేసే ఎగ్ కార్ట్‌ని ఉచితంగా అందించారు. మాడుగుల కేంద్రంలో నూడిల్స్ వ్యాపారంపై ఆధారపడి తల్లి, ఇద్దరు కొడుకులు, కోడళ్లు చిన్న బడ్డీ ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. కుటుంబానికి జీవనాధారమైన గ్రామానికి చెందిన బొంగరాల పద్మని ఎంపిక చేసి ప్రభుత్వం అందించిన ఎగ్‌కార్ట్‌ని ఉచితంగా అందించారు. దీంతో పాటు కస్పా జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆడారి లక్ష్మికి కూడా ఎగ్ కార్ట్ మంజూరైనట్టు చెప్పారు. త్వరలో మరొకటి సెంక్షన్ చేసేందుకు వెసులుబాటు ఉందని, అది కూడా అర్హులైన వారిని గుర్తించి అందిస్తామని వెలుగు అధికారులు తెలిపారు. తమను గుర్తించి జీవనోపాధికి దారి చూపించిన ప్రభుత్వానికి పద్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రామాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



గొలుగొండ రామాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న భక్తులు

గొలుగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గొలుగొండలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దళిత కాలనీలోని రామాలయంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 30 మంది మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్.లోవరాజు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ



విజ్ఞాన్ సిబ్బందికి ట్యాబ్‌లు అందిస్తున్న పైలా ప్రసాదరావు

మాడుగుల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాడుగుల విజ్ఞాన్ పబ్లిక్ హైస్కూల్ సిబ్బందికి ఆ పాఠశాల అధినేత పైలా ప్రసాదరావు శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు టెక్నాలజీని దృష్టిలో పెట్టుకొని ఈ ట్యాబులను అందించినట్టు చెప్పారు. నర్సరీ నుంచి విద్యార్థులకు స్మార్ట్ క్లాసుల సదుపాయం కల్పిస్తామని ఆయన చెప్పారు. పిల్లలు విద్యా రంగంలో రాణించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండలరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో రెండు బార్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసేవారు మూడేళ్ల గడువుకుగాను ఒక్కో బార్‌కు రూ.5 లక్షలు, ప్రోసెస్ ఫీజు కోసం మరో రూ.లక్ష కట్టాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నెల 29వ తేదీలోే సాయంత్రం 5 గంటల్లోగా అనకాపల్లి కార్యాలయంట దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీఐ, ఎస్ఐ 9440902388, 9949129219 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్నికల హామీలు అమలుచేయండి

▸▸ మాజీ మంత్రి ఆర్కే రోజా

రావికమతం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తప్పకుండా ఆమలు చేయాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్ చేశారు. దొండపూడి గ్రామ దేవత పండుగ కోసం గురువారం రాత్రి ఇక్కడికి విచ్చేసిన ఆమె బహిరంగ సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ పథకాలు ఆమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ పాలన సాగుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అమ్మవారి పండుగ పేరుతో ఇరు పార్టీల కార్యకర్తలు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులను గ్రామానికి రప్పించి ఉనికి చాటుకున్నారని స్థానికులు చర్చించుకోవడం విశేషం.

ఉమ్మడి జిల్లా విశ్వసాహితీ కళావేదిక అధ్యక్షుడిగా కుమార్‌రాజు



కుమార్‌రాజు

చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశ్వసాహితీ కళావేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ప్రముఖ రచయిత బుర్రి కుమార్‌రాజు నియమితులయ్యారు. ఈ మేరకు కళావేదిక సంస్థ ఛైర్మన్ కొల్లి రమాదేవి నియామకపత్రం జారీ చేశారు. సాహితీ కళావేదిక సంస్థ కార్యక్రమాలు ముందుకు తీసుకు వెళ్లడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కుమార్‌రాజు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోండి

చోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యూరియా అందుబాటులో లేకపోవడంతో వ్యాపారుల నుంచి అధిక ధరలకు రైతులు కొనుక్కోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాలు, సహకార సంఘాల్లో యూరియా లేకపోవడంతో రైతాంగం ఎరువుల కొరత ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇదే అదనుగా కల్తీ ఎరువులు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నవయువ సమాఖ్య రాష్ట్ర నేత నందారపు భాస్కరరావు, రైతు కూలీ సంఘం నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, రాము, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా చెల్లించాలి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లోగా నీటి తీరువా చెల్లించాలని తహసీల్దార్ ఎం.లక్ష్మి కోరారు. మండలంలోని పెదపూడి, తురకలపూడి, చిన్నప్పన్నపాలెం, ఆర్.భీమవరం, పోలేపల్లి, పీపీ.అగ్రహారం, మంగళాపురం, గంటికొర్లాం, విజయరామరాజుపేట గ్రామాల్లో బకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అత్యధికంగా వడ్డాది రైతులు రూ.14 లక్షలు, విజయరామరాజుపేట రైతులు రూ.11 లక్షలు చెల్లించాల్సి ఉందని ఆమె చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా కలిగట్ల 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్టు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని రొంగలినాయుడుపాలెం, పైడంపేట, పాచిలవానిపాలెం, మురుగుపాలెం, బంటువారి కల్లాలు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరపరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 200 మందికి పరీక్షలు చేయగా, వారిలో 12 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా అద్దాలు అందజేస్తామని వైద్యులు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దొడ్డి అప్పారావు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

చీడికాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.సింగవరం గ్రామంలో శుక్రవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ పి.సూర్యకళ, వైద్య సిబ్బంది సావిత్రి, పి.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రోడ్డు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

చీడికాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ పొలం మీదుగా కోళ్ల ఫారానికి వేసిన గ్రావెల్ రోడ్డును తవ్వేసి పంటను నాశనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చీడికాడ గ్రామ టీడీపీ నాయకుడు బండారు దేముడునాయుడు కోరారు. ఈ మేరకు చీడికాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపచెరువు కింద తన సొంత వ్యవసాయ భూమి ఉందని, దానిలో కోళ్లఫారం నిర్మించుకున్నానని చెప్పారు. కోళ్లఫారానికి వెళ్లేందుకు 15 సంవత్సరాల క్రితం తన పొలంలో నుండి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశానన్నారు. రోడ్డుకు ఎగువున ఉత్తరభాగాన తనతో పాటు కొంత మంది రైతుల సాగు భూములు ఉన్నాయన్నారు. ఆ పక్కనే సాగునీరు వెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మదుము, కాలువను తవ్వేశారన్నారు. దీనిపై పెద్దల్లో పంచాయితీ కూడా జరిగిందన్నారు. పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.

బొజ్జ గణపయ్యలు సిద్ధం



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

గొర్లివానిపాలెం కేంద్రంగా వివిధ ఆకృతుల్లో తయారీ

- రూ.వెయ్యి నుంచి రూ.19 వేల వరకు ధరలు
- పలు ప్రాంతాలకు ఇక్కడ నుంచే సరఫరా
- అడ్వాన్స్‌లు చెల్లించి ఆర్డర్ ఇస్తున్న చవితి ఉత్సవ నిర్వాహకులు

పరవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల తయారీ కేంద్రమైన గొర్లెవానిపాలెంలో బొజ్జ గణపయ్య విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. చవితికి కేవలం ఐదు రోజుల వ్యవధి ఉండడంతో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే పనిలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్న పలువురు యువజన సంఘాల సభ్యులు తమకు కావాల్సిన విగ్రహాలను ఎంచుకొని అడ్వాన్స్ చెల్లిస్తున్నారు.

స్థానికంగా విగ్రహాలను తయారు చేసి మండలంతో పాటు పెదగంట్యాడ, గాజువాక, అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, రాజన్నపాలెం, తంతడి, తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి విగ్రహాలను సరఫరా చేస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.19 వేలు వరకు ధరలు వున్నాయి. సైజును బట్టి ధర నిర్ణయించి విగ్రహాలను విక్రయిస్తున్నారు. రెండు అడుగుల ఎత్తు నుంచి 10 అడుగుల ఎత్తు గల విగ్రహాలు ఇక్కడ సిద్ధంగా వున్నాయి. మూడు నెలల ముందు నుంచి ఇక్కడ విగ్రహాలను తయారు చేయడం గత 25 ఏళ్ల నుంచి కొనసాగుతున్నదని తయారీదారులు చెబుతున్నారు. ప్రతి ఏడాది రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని పేర్కొన్నారు. తమ వద్ద 10 మంది కూలీలు విగ్రహాల తయారీలో సేవలందిస్తారని చెప్పారు. కాగా ఈ ఏడాది మండలంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు





విక్రయించడానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

జరుగుతున్నాయి. దీనిలో భాగంగా వీధుల్లో వినాయక చలువ పందిళ్లను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల పందిళ్లను భారీ సెట్టింగులు ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. తయారీదారులు ఇక్కడ తయారవుతున్న విగ్రహాలకు ముడి సరుకు విశాఖపట్నం, ముంబై పరిసర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రంగుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తయారీదారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గత 25 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నామని తయారీదారుడు అరుణ్‌కుమార్ తెలిపారు. పది మంది కూలీలతో చవితికి మూడు నెలల ముందు నుంచే విగ్రహాలు తయారు చేస్తున్నామన్నారు. ఇక్కడ అన్ని వెరైటీల విగ్రహాలను తయారు చేస్తున్నామని, ధరలు అందుబాటులో ఉంచామని, ఈ ఏడాది ఎక్కువ వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నామని ఆయన తెలిపారు.

అందమైన ప్రేమకథా చిత్రం 'సుందరకాండ'



సమావేశంలో పాల్గొన్న నారా రోహిత్, శ్రీదేవి, వీర్తి

రామ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సుందరకాండ.. అందమైన సరికొత్త ప్రేమకథా చిత్రమని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. సందీప్ పిక్చర్స్ బ్యానర్‌పై నారా రోహిత్ హీరోగా ఈశ్వర్ ఫేం శ్రీదేవి, వీర్తివిఘాని హీరోయిన్లుగా నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వంలో రూపొందించిన 'సుందరకాండ' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నారా రోహిత్ మాట్లాడుతూ 27న వినాయక చవితి పండుగ సందర్భంగా సుందరకాండ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. అందరినీ ఆహ్లాదపరిచే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని పేర్కొన్నారు. కొత్తపాయింట్‌తో ప్రతీ సీన్ కొత్తగా అనిపించేలా స్క్రీన్‌ప్లే ఉంటుందని తెలిపారు. సినిమాను విశాఖ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు తెలిపారు. వైవిధ్యమైన కథలతో సినిమాలు చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో తప్పనిసరిగా రాజకీయాల్లోకి వెళతానని ప్రకటించారు. ఈ సమావేశంలో హీరోయిన్లు శ్రీదేవి, వీర్తి, నిర్మాత సీహెచ్ సంతోష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో న్యాయ విద్యాభ్యాసన

- నోయిడా ఐఐఎల్‌ఎంయూ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్



నోయిడా ఐఐఎల్‌ఎం వర్సిటీ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ రణబీర్‌సింగ్‌ను శాలువాతో సత్కరించిన డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చట్టాల్లో వస్తున్న మార్పులకు అను గుణంగా న్యాయ విద్యాభ్యాసన ఉండాలని నోయిడా ఐఐఎల్ఎం యూనివర్సిటీ ప్రో-చాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్‌సింగ్ పేర్కొన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ విద్యార్థులకు శుక్రవారం ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలో ఎంత కష్టపడితే భవిష్యత్తులో అంత ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. చట్టాలను అవగాహన చేసుకుంటూ ఎంతో జాగరూకతతో న్యాయవిద్యను అభ్యసించాలని సూచించారు. తన వద్ద చదువుకున్న ఎంతో మంది న్యాయ విద్యార్థులు అనంతర కాలంలో సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయాధిపతులుగా ఎదిగారని, మీరు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మీరు ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడే ఈ వర్సిటీకి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, న్యాయ విద్య, ఉపాధి అవకాశాలపై ప్రతి వారం నిపుణులతో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

తగ్గుతున్న ప్లాస్టిక్ వాడకం

- అనర్థాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- ప్లాస్టిక్ విక్రయాలను క్రమేపీ తగ్గిస్తున్న వ్యాపారులు
- హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో అరటి ఆకుల వినియోగం



అరటి ఆకులో అల్పాహారం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై వ్యాపారులు, పట్టణవాసుల్లో క్రమంగా అవగాహన పెరుగుతున్నది. ప్లాస్టిక్/ పాలిథిన్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అధికారులు వివరిస్తుండడంతో వ్యాపారులు వీటి అమ్మకాలను తగ్గిస్తున్నారు. ఇదే సమయంలో ప్రజలు సైతం ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఆలయాల్లో ప్రసాదాలకు ప్లాస్టిక్ ప్లేట్లు స్థానంలో పూర్వం మాదిరిగా అరటి ఆకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో నిత్యం 300 మందికిపైగా అన్నప్రసాద వితరణ చేస్తుంటారు. ఇటీవల వరకు స్టీల్ ప్లేట్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పేపరు పెట్టి భక్తులకు భోజనాలు పెట్టేవారు. అయితే కొద్ది రోజులు నుంచి భక్తులకు అరిటాకుల్లో భోజనాలు వడ్డిస్తున్నారు. పట్టణంలోని పలు టిఫిన్ దుకాణాల్లో కూడా వ్యాపారులు ప్లాస్టిక్‌ను వాడడం లేదు.



టిఫిన్ దుకాణంలో అరటి ఆకులు సిద్ధం చేస్తున్న మహిళా వ్యాపారి



నూకాంబిక ఆలయంలో అరటి ఆకుల్లో భోజనం చేస్తున్న భక్తులు

స్టీల్‌ప్లేట్‌లో అరిటాకు పెట్టి దానిపై ఆహారపదార్థాలను అందిస్తున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో కూడా ప్లాస్టిక్‌ను వినియోగించ వద్దని జడ్సీ కె.చక్రవర్తి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ మంచినీటి బాటిళ్లను కూడా వినియోగించవద్దని స్పష్టం చేశారు.

తరలిపోతున్న 'పోలవరం' మట్టి!

- ఎలమంచిలి సమీపంలో కాలువ గట్టును తవ్వుకుపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని ప్రాజెక్టు అధికారులు



ఎలమంచిలి మర్రిబంద సమీపంలో పోలవరం కాలువ గట్టును తవ్వి, ట్రాక్టరులోకి మట్టిని లోడ్ చేస్తున్న కూలీలు

ఎలమంచిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సమీపంలో పోలవరం కాలువ గట్టును కొంతమంది అక్రమార్కులు తవ్వేసి, మట్టి/గ్రావెల్‌ను ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. దీనివల్ల కాలువ గట్టు బలహీనంగా మారి, భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలమంచిలి సమీపంలోని పెదపల్లి, కొక్కిరాపల్లి, మర్రిబంద, లైనుకొత్తూరు పరిసర ప్రాంతాల మీదుగా పోలవరం కాలువ తవ్వారు. ఇక్కడ ఎత్తైన కొండవాలు ప్రదేశం కావడంతో కాలువను ఎక్కువ లోతు తవ్వాల్సి వచ్చింది. ఈ కారణంగా పెద్ద మొత్తంలో మట్టి, గ్రావెల్ రావడంతో కాలువ ఇరువైపులా భారీ గట్లను ఏర్పాటు చేశారు. కాగా పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంలో పునాదులు ఎత్తు చేయడం, రియల్ ఎస్టేట్ వెంచర్లలో రోడ్ల నిర్మాణం వంటి పనులకు గ్రావెల్ అవసరం ఏర్ప డింది. కొంతమంది అక్రమార్కులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తవ్వాల్సిన శ్రమ లేకుండా అందుబాటులో పోలవరం కాలువ గట్టు వుండడంతో అక్కడి నుంచి గ్రావెల్, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. అక్రమంగా గ్రావెల్ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే.. భవిష్యత్తులో పోలవరం కాలువ గట్టుకు బలహీనంగా మారి, గండి పడే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

డీఎస్సీ ఫలితాలు విడుదల

... 5వ పేజీ తరువాయి

ద్వితీయ స్థానం, సీహెచ్‌డీజీ బ్రహ్మచారి 84.27 మార్కులతో తృతీయ, తెలుగులో పంపోతు నాగేశ్వరరావు 85.4 మార్కులతో ప్రథమ, గురుగుబిల్లి చిరంజీవి 82.77 మార్కులతో ద్వితీయ, ఓమ్మి గంగునాయుడు 82.06 మార్కులతో తృతీయ, హిందీలో కరచా జ్యోత్స్న 86.05 మార్కులతో ప్రథమ, రెడ్డి మహాలక్ష్మి 85.05 మార్కులతో ద్వితీయ, మండపాలి ఝాన్సీబాయి 83.07 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

ఇంగ్లీష్‌లో మరడాన శ్రావణి 86.13 మార్కులతో ప్రథమ, కేఎస్‌కేజే ప్రకాష్ 85.72 మార్కులతో ద్వితీయ, దాడి దివ్యపరిమిళ 83.9 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గొర్లె శివరామకృష్ణ 83.5 మార్కులతో ప్రథమ, చిట్టిమూరి వరప్రసాద్ 80.5 మార్కులతో ద్వితీయ, ఎర్ని శివప్రసాద్ 79 మార్కులతో తృతీయ, సోషల్ స్టడీస్‌లో గెంజి రవి 87.28 మార్కులతో ప్రథమ, భవిరిశెట్టి రామకృష్ణ 86.18 మార్కులతో ద్వితీయ, కర్రిరాజు నాగేశ్వరరావు 85.99 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్జీటీ ఉర్దూలో షేక్ వాసింఅక్రమ్ 68.33 మార్కులతో ప్రథమ, పీడీఎస్ జావేద్ బాషా 62.6 మార్కులతో ద్వితీయ, పాలగిరి సానా 53.3 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

జోన్-1 ప్రాతిపదికన పీజీటీ ఫలితాలు వెల్లడి...

మొదట పీజీటీ (పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్) రాత పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. జోన్-1 (ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో పీజీటీకి సంబంధించి అన్ని సబ్జెక్టులకూ కలిపి 73 పోస్టులు ఉన్నాయి. పీజీటీ ఇంగ్లీష్ పరీక్ష 1,659 మంది రాయగా వచ్చిన మార్కుల వివరాలను మెరిట్ లిస్టులో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పిన్నింటి రవికుమార్ అనే అభ్యర్థి 79.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, మజ్జి భవానీ 79 మార్కులతో రెండో ర్యాంకు, మళ్ల శ్రీను 78.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. హిందీ పరీక్ష 726 మంది రాయగా లెంక చక్రపాణి 82.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కురచా నారాయణమూర్తి 82.5 మార్కులతో రెండో ర్యాంకు, చింతాటి భారతి 82 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. తెలుగు పరీక్ష 2,102 మంది రాయగా పి.ధర్మారావు 85.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, తుమరాడ దుర్గాప్రసాద్ 84.5 మార్కులతో రెండో ర్యాంకు, సరిపల్లి నాగరాజు 83 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. బయాలజీ సైన్స్ 549 మంది రాయగా కాత్రేనుకోన సత్యపావని 77.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కాలేరపు కిషోర్ 72.5 మార్కులతో ద్వితీయ స్థానం, అల్లెను సౌజన్య 72.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. సివిక్స్ (57 మంది)లో బొల్లేజు హరీష్ 76.5 మార్కులతో ప్రథమ స్థానం, బొమ్మిడి ఢిల్లేశు 69 మార్కులతో రెండో స్థానం, బూరి తవిటినాయుడు 66.5 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. కామర్స్‌లో 81.5 మార్కులతో మద్దాల అనిల్‌కుమార్ ప్రథమ స్థానం, 60.5 మార్కులతో దుద్ది సూర్యనారాయణ ద్వితీయ స్థానం, 59.5 మార్కులతో లింగాల మోహన్ తృతీయస్థానంలో నిలిచారు. గణితం (452 మంది)లో 78.5 మార్కులతో సుంకరాన విజయ, 73.5 మార్కులతో ఆరంగి ధనుంజయరావు, 72 మార్కులతో కొప్పల లక్ష్మణరావు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫిజికల్ సైన్స్ (420 మంది)లో 74 మార్కులతో నక్కా హరిబాబు, 70 మార్కులతో వెలగల ఎర్రాపాత్రుడు, 68.5 మార్కులతో అల్లు అశోక్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సోషల్ స్టడీస్ (146 మంది)లో కురమాన నిరోషా 85 మార్కులతో ప్రథమ స్థానం, రౌతు పోలినాయుడు 77.5 మార్కులతో ద్వితీయ స్థానం, కిల్లంపల్లి శ్రీకాంత్ 75.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

నేడు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

- 'వర్షాకాలంలో పరిశుభ్రత' థీమ్
- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించనున్న స్వరాం ధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతోపాటు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. 'వర్షాకాలంలో పరిశుభ్రత'ను థీమ్‌గా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. మండల, అసంబ్లీ నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు స్వయంగా కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతతోపాటు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి కాలానుగుణ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలన్నారు. మురుగునీటి కాలువలను శుభ్రపరచాలని, దోమల నివారణ మందును పిచికారీ చేయాలని చెప్పారు. తాగునీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి.రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల విజేత కడప

- కబడ్డీలో విజయనగరం, క్విజ్ పోటీల్లో పలాస..



క్విజ్ పోటీల్లో ప్రథమ విజేతకు నగదు అందిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యే రాజు తదితరులు

రావికమతం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడిలో గురువారం అర్ధరాత్రి వరకు జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో గురువారం రాష్ట్రస్థాయి పురుషుల వాలీబాల్, మహిళల కబడ్డీ, ఉభయులకు ఉత్తరాంధ్రస్థాయిఇ క్విజ్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ఫైనల్స్ కడప, ఏటికొప్పాక జట్ల మధ్య జరగ్గా.. కడప జట్టు విజయం సాధించింది. తృతీయ స్థానంలో రాజమండ్రి, నాలుగో స్థానంలో గుమ్మాళ్లపాడు జట్లు నిలిచాయి. అలాగే రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ ఫైనల్స్ అనకాపల్లి జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. మూడో స్థానంలో గాజువాక జట్టు నిలిచింది. ఉత్తరాంధ్రస్థాయి క్విజ్ పోటీల్లో పది జట్లు పాల్గొనగా.. శ్రీకాకుళం జిల్లా పలాస జట్టు విజేతగా నిలిచింది. రెండు, మూడు, నాలుగు, ఐదు బహుమతులను సంతకవిటి, బొబ్బిలి, నెల్లిమర్ల, విజయనగరం దక్కించుకున్నాయి. కన్సొలేషన్ బహుమతికి విశాఖపట్నం జట్టును ఎంపిక చేశారు. విజేతలకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఎరువుల కృత్రిమ కొరత!

... 5వ పేజీ తరువాయి

కోటవురట్ల, రోలుగుంట మండలాల్లో ఎరువుల కొరత ఎక్కువగా ఉందని శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరి సాగు అధికంగా వుండే అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో కూడా ఎరువుల కొరత వుందని రైతులు చెబుతున్నారు.

కృత్రిమ కొరత.. ధరల పెంపు!

ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం 45 కిలోల యూరియా బస్తా రూ.266కు విక్రయించాలి. కానీ వ్యాపారులు రూ.350కి అమ్ముతున్నారని రైతులు చెబుతున్నారు. అదే విధంగా 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,320 కాగా.. వ్యాపారులు రూ.1,500 వసూలు చేస్తున్నారు. నాతవరం మండలంలో కొందరు వ్యాపారులు బస్తాకు రూ.30 అదనంగా వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదులపై అధికారులు విచారణ జరుపుతున్నారు. జిల్లాలో పలు మండలాల్లో ప్రైవేటు దుకాణాలు, పీఏసీఎస్‌లలో ఎరువులను బ్లాక్ చేసి, తమ నిల్వలు లేవని చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎరువుల విషయంలో అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. వరి కాకుండా ఇతర పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నందునే కొరత ఏర్పడుతున్నదని అధికారులు అంటున్నారు.

అదనంగా 1,046 టన్నుల ఎరువులు

బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో ఎరువుల కొరత లేదు. అయితే కొన్ని పీఏసీఎస్‌లలో బయోమెట్రిక్ నమోదు చేయకుండా కొంతమంది రైతులు ఎక్కువ మొత్తంలో ఎరువులు తీసుకెళుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. శాసనసభ స్పీకర్ ఆదేశాల మేరకు జిల్లాకు మరో 1,046 టన్నుల యూరియాను రప్పిస్తున్నాం. వరినాట్లు వేసిన తరువాత ఎకరాకు ఒక బస్తా యూరియా వేస్తే సరిపోతుంది.

ఎరువుల వ్యాపారిపై క్రిమినల్ కేసు

... 5వ పేజీ తరువాయి

తక్కువ ధర ఎరువులను ఎక్కువ ధరల బ్యాగుల్లోనికి మార్చుతున్నట్టు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం అధికారులు అతని దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లభించలేదు. తరువాత పెదబజారు వీధిలోని ఓ ఇంటిలో తనిఖీ చేశారు. స్పిక్ కంపెనీకి చెందిన ప్రోం అనే ఎరువును అదే కంపెనీకి చెందిన అధిక ధర గల బ్యాగులో ప్యాక్ చేసి అమ్ముతున్నట్టు తేలింది. ఈ సందర్భంగా 20 బస్తాల ఎరువులను అధికారులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతోపాటు, కంపెనీకి చెందిన ఎరువుల బస్తాల ఖాళీ సంచులను కూడా స్వాధీనం చేసుకుని, వ్యాపారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారితోపాటు, ఏవో పావని, విస్తరణాధికారి కిరణ్ పాల్గొన్నారు.

ఎలమంచిలి బస్టాండ్ కళకళ

... 5వ పేజీ తరువాయి

బస్టాండ్ నుంచి/ మీదుగా రోజూ 74 బస్సులు నడుస్తున్నాయి. వీటిలో 17 పల్లె వెలుగు, 26 ఆర్డినరీ, 26 మెట్రో, ఐదు సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సులు వున్నాయి. ఇక్కడి నుంచి ఎక్కువగా విశాఖ, అనకాపల్లి, నక్కపల్లి, పాయకరావుపేట ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి రాకముందు మొత్తం ప్రయాణికుల్లో సుమారు 40 శాతం మంది మహిళలు, యువతులు వుండేవారు. 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన తరువాత ఇంచుమించు 60 శాతానికి పెరిగింది. అనకాపల్లి, విశాఖతోపోలిస్తే పాయకరావుపేట వైపు వెళ్లే బస్సుల్లో రద్దీగా అధికంగా వుంటున్నది. ఎలమంచిలి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు సింహాచలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లి వస్తున్నారు. ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ఆలయాల దర్శనంతో ప్రారంభించాలని భావిస్తున్నట్టు ఈ సందర్భంగా పలువురు మహిళలు చెబుతున్నారు.

పచ్చదనంపై వేటు!

... 5వ పేజీ తరువాయి

ఆ మార్గంలో వెళ్లే వారికి నీడను ఇస్తున్నాయి. ఇంకా జుత్తాడ, సింహాద్రిపురం, గౌరీపట్నం-వడ్డాది మార్గంలో, లక్కవరం-గవరవరం మధ్యలో కూడా రోడ్డు పక్కన చెట్లు ఏపుగా పెరిగాయి. ఇప్పుడు విద్యుత్ లైన్ల ఏర్పాటు పేరిట ఈ చెట్లను నరికివేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ లైన్లకు అడ్డుగా వున్న చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెట్లను పూర్తిగా తొలగించకుండా చూస్తాం

టి.ఉదయ్‌కుమార్, ఈపీడీసీఎల్ రూరల్ ఏఈ, చోడవరం

ఇళ్లు, వ్యవసాయ అవసరాల కోసం వేర్వేరుగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా కొన్నిచోట్ల విద్యుత్ వైర్లకు అడ్డుగా వున్న చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించాం. చెట్లు పూర్తిగా నరికివేయకుండా తగు చర్యలు తీసుకుంటాం.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	101.00
లైవ్ ధర	121.00
విత్ స్కిన్	212.00
స్కిన్ లెస్	222.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529